కూటమి పాలనలో రైతన్నకు కష్టాలు

- అందుబాటులో లేని యూరియా
- చాలా మందికి అన్నదాత సుఖీభవ జమకాని వైనం
- కార్యాలయాల చుట్టూ అన్నదాతల ప్రదక్షిణలు
- అగ్రికల్చర్ అసిస్టెంట్ల బదిలీతో తెరుచుకోని రైతు సేవా కేంద్రాలు


కోసిగి వ్యవసాయ కార్యాలయం ఎదుట యూరియా కోసం వేచి ఉన్న రైతులు

కోసిగి: రాష్ట్రంలో కూటమి పరిపాలనలో రైతులకు కష్టాలు మొదలైయ్యాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నాటి నుంచి రైతులు పంటలకు యూరియా దొరకక్క అష్ట కష్టాలు పడుతున్నారు. గత రెండు రోజులుగా మండలంలో విస్తారంగా వర్షాలు కురిశాయి. దాదాపు పదిహేను రోజుల తర్వాత వర్షం కురువడంతో రైతులు సంతోషం పడ్డారు. కానీ పంటకు యూరియా మందు వేసుకోవాల్సి ఉండగా.. గ్రామాల్లో రైతు సేవా కేంద్రాలు, ప్రైవేట్ ఫర్టిలైజర్స్ దుకాణలు, మండల కేంద్రం వ్యవసాయ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా ఎక్కడా అందుబాటులో లేదు. మండలంలోని వివిధ గ్రామాల రైతులు పట్టాదారు పాసు పుస్తకాలు పట్టుకుని రోడ్ల వెంబడి, కార్యాలయాలు చుట్టూ తిరుతూ నాన కష్టాలు పడుతున్నారు.

నేడు కూటమి పరిపాలన పనితీరు ఇలా :
కోసిగి మండలంలో ఖరీఫ్‌లో 16,500 హెక్టార్లు పంట పొలాలు సాగు చేసుకోగా అందులో అత్యధికంగా పత్తి పంట సాగుచేసుకున్నారు. రాష్ట్రంలో కూటమి పరిపాలన వచ్చి 14 నెలలు కావస్తోంది. ఈ ఏడాది ఖరీఫ్ నుంచి రైతులు యూరియా కోసం అష్టకష్టాలు పడుతున్నారు. ఇటీవల విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు బదిలీ కావడంతో పలు గ్రామాల్లో రైతు సేవా కేంద్రాలు తెరుచుకోవడం లేదు. అలాగే ఇటీవల కూటమి పాలన వచ్చిన తర్వాత ఒక ఏడాది పెట్టుబడి సహాయం అందలేదు. రెండవ ఏటా ఖరీఫ్ ప్రారంభ రెండు నెలల తర్వాత అన్నదాత సుఖీభవ అంటూ పీఎం కిసాన్ రూ.2వేలు, అన్నదాత సుఖీభవ రూ.5వేలు చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నారు. కోసిగి మండలంలో దాదాపు 14వేల మంది రైతులు ఉన్నారు. అయితే ఇందులో కుటుంబంలో ఒకరి చొప్పున 9,578 మందికి మాత్రమే జమఅయినట్లు అధికారులు చెబుతున్నారు. దీంతో చాలా మంది రైతులకు ఖాతాల్లో నగదు జమ కాక పోవడంతో రైతు సేవా కేంద్రాలు, మండల వ్యవసాయ కార్యాలయం, బ్యాంక్‌ల చుట్టూ తిరుగు అవస్థలు పడరాని పాట్లు పడుతున్నారు. మరికొందరు కార్యాలయాల వద్ద అధికారులు వచ్చేంత వరకు పడిగాపులు కాయాల్సిన దుస్థితి ఏర్పడింది.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ..

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో రైతుల సంక్షేమమే ధ్యేయంగా రైతులకు కష్టాలు లేకుండా చేసేలా మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చర్యలు తీసుకున్నారు. గ్రామాల్లో అన్నీ విధాల అధికారులు అందుబాటులో ఉంటూ సేవల అందించేందుకు గ్రామ గ్రామాన రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటి ద్వా రా విత్తనాల నుంచి ఎరువులు అందుబాటులో ఉంచారు. ఏ సమస్య ఉన్నా గ్రామాల్లోనే పరి ష్కారం లభించేది. ప్రతి ఏటా పెట్టు బడి సా యం కింద జూన్ నెలలో రైతు భరోసా అందించారు. అలాగే గ్రామాల్లోనే సబ్సిడీతో వ్యవసాయ పనిముట్లు అందించారు. పంటలు నష్టపోతే పంట నష్టపరిహారం అందించి ఆదుకున్నారు.

యూరియా కోసం తిరుగుతున్నా



మాది జంపాపురం గ్రామం. నాకున్న 2.40 ఎకరాల పొలంలో పత్తి సాగుచేసుకున్నా. పదిహేను రోజులుగా వర్షం లేక పంట ఎండుముఖం పట్టింది. అంతలో వరుణ దేవుడు కరునించి వర్షం బాగా కురిసింది. అయితే పంటకు యూరియా చల్లుకోవాలి. జంపాపురం, కోసిగి, కార్యాలయాలు చూట్టూ తిరిగినా యూరియా దొరకలేదు.

– జానయ్య, జంపాపురం రైతు

అన్నదాన సుఖీభవ పడలేదు



మాది కందుకూరు గ్రామం. నాకు 2ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. పీఎం కిసాన్ కింద రూ.2వేలు నగదు జమ అయ్యింది. కానీ అన్నదాత సుఖీభవ నగదు జమ కాలేదు. గ్రామంలో రైతు సేవా కేంద్రంలో అధికారులు ఎవరూ లేరు . కోసిగి వ్యవసాయ కార్యాలయానికి వచ్చినా ఎవరూ సమాధానం చెప్పలేక పోవడంతో చేసేది లేక వెనుతిరగాల్సి వచ్చింది.

– రాఘవరెడ్డి, రైతు,కందుకూరు

ఇండెంట్ పెట్టాం



కోసిగి మండలానికి ఈ ఏడాది ఖరీఫ్‌లో యూరియా రైతు సేవాల కేంద్రాల నుంచి 440 మెట్రిక్ టన్నులు తెప్పించి అందించాం. మరలా 400 మెట్రిక్ టన్నులు ఇండెంట్ పెట్టాం. వచ్చిన వెంటనే గ్రామాల వారిగా పంపిణీ చేస్తాం. అన్నదాత సుఖీభవ కుటుంబంలో ఒకరి మాత్రమే నగదు జమచేస్తారు. రైతులందరికీ రాదు. ప్రతి గ్రామంలోనే రైతు సేవా కేంద్రాల వద్ద అన్నదాత సుఖీభవ నగదు జమ కాకపోతే చెక్ చేసుకోవచ్చు.

– వరప్రసాద్, వ్యవసాయాధికారి, కోసిగి

క్లుప్తంగా

మార్కండేయ స్వామికి విశేష పూజలు


శివపార్వతిలకు ఊంజల సేవ నిర్వహిస్తున్న భక్తులు

కోసిగి: మండల కేంద్రంలో వెలసిన భక్త మార్కండేయ స్వామికి విశేష పూజలు చేపట్టారు. ఆదివారం ఆలయంలో స్వామి వారికి శ్రావణ మాసం మూడవ ఆదివారాన్ని పురస్కరించుకుని ఆదోనికి చెందిన వేదపండితులు వెంకటేష్ శాస్త్రి, రామచంద్ర శాస్త్రి , ఆలయ అర్చకులు వీరేష్ స్వామి ఆధ్వర్యంలో రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, ఆకు పూజ, వెండి కవచ అలంకరణ, మహా మంగళ హారతలు గావించి, ఫలపుష్పాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేపట్టారు. అలాగే గోమాత పూజ, గణపతి, నవగ్రహా, ఆంజనేయ స్వామిలకు హారతులు ఇచ్చి పూజలు చేశారు. భక్తులు శివ పార్వతి విగ్రహాలకు ఊంజల సేవా కార్యక్రమం నిర్వహించారు. శ్రావణ మాస మూడవ సోమవారం పురస్కరించుకుని సాయంత్రం శివపార్వతిల విగ్రహాలను రథోత్సవం నిర్వహించనున్నారు.

ప్రారంభమైన రాఘవేంద్ర స్వామి ఆరాధనోత్సవాలు


ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న మంగరాయ ఆంజనేయస్వామి

ఆదోని అర్బన్: పట్టణశివారులోని మంగరాయ కాలనీలో వెలిసిన మంగరాయ ఆంజనేయస్వామి సన్నిధిలో మంత్రాలయం మఠం శ్రీ రాఘవేంద్రస్వామి ఆరాధన మహోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఆలయ మేనేజర్ భీమసేన ఆధ్వర్యంలో స్వామివారికి ఫల పంచామృతాభిషేకం, క్షీరాభిషేకం, తేనాభిషేకం, పూల అలంకరణ, ప్రత్యేక హోమాలు చేశారు. ఆలయ ప్రాంగణంలో పల్లకోత్సవం, రథోత్సవం, నైవేద్యం, మహామంగళహారతితో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గర్జిలింగేశ్వరస్వామి గంగపూజకు ఏర్పాట్లు

ఆదోని రూరల్: మండలంలోని నారాయణపురం గ్రామంలో గర్జిలింగేశ్వరస్వామి గంగ పూజ కార్యక్రమానికి సర్పంచ్ అల్లమ్మ గారి సరళమ్మ, ఆమె భర్త అల్లమ్మ గారి పురుషోత్తం రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఆదివారం ఆలయం వద్ద విద్యుత్ బల్బులను బిగించే పనులను చేపట్టారు. గతంలో పనిచేయని విద్యుత్ బల్బులకు మరమ్మతులు చేస్తున్నారు.

వీహెచ్‌పీ మండల కమిటీ ఎన్నిక

కౌతాళం: విశ్వహిందూ పరిషత్ మండల నూతన కమిటీని ఆదివారం త్రీలింగేశ్వర స్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎన్నుకున్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు భీమిరెడ్డి, కార్యదర్శి హనుమంతరెడ్డి, ధర్మప్రచార సంయుక్త్ సీతారాములు, సలహాదారుడు మారుతిమోహన్‌ల ఆధ్వర్యంలో ఎన్నిక జరిగింది. మండల అధ్యక్షుడిగా చౌదరి బసవరాజు, ఉపాధ్యక్షులుగా బోయ లింగన్న, తొంతనాహాల్ చంద్ర, కార్యదర్శిగా వడ్డె పరమేష్, సహాయ కార్యదర్శిగా బేస్త నాగరాజు, కోశాధికారిగా మంగలి శివ, సత్సంగ్ ప్రముఖ్‌గా పల్లెద బసవరాజులను ఎన్నికయ్యారు. బజరంగదళ్ సంయుక్త్‌గా నరేష్ ధర్మప్రచార ప్రముఖులుగా ఉమాపతి, గోరక్ష ప్రముఖగా రవి, ప్రచార ప్రసార ప్రముఖ్‌గా ఆంజి సేవ ప్రముఖ్‌గా కబడ్డీ మహేశ్, విషేస్ సంకార సంయుక్త్‌గా లింగేష్, లక్ష్మయ్యలను సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కామన్‌దొడ్డిలో కార్డెన్ సెర్చ్


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ హనుమంత రెడ్డి

కోసిగి: మండల పరిధిలోని ఫ్యాక్షన్ గ్రామమైన కామన్‌దొడ్డి గ్రామంలో ఆదివారం ఎస్‌ఐ హనుమంత రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలో అనుమానితులు, రౌడీషీటర్లు, నేరచరిత్ర కలిగిన వారి ఇళ్లలో సోదాలు నిర్వహించారు. అనంతరం గ్రామ ప్రజలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ.. ఫ్యాక్షన్‌కు దూరంగా ఉండాలని, క్షణికావేశానికి వెళ్లి కుటుంబాలు నాశనం చేసుకోరాదన్నారు. గ్రామంలో ఎలాంటి సమస్యలు ఉన్నా పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించాలన్నారు. అంతేకానీ గొడవులు పడి కక్షలు పెంచుకోకూడదని సూచించారు. కార్యక్రమంలో ట్రైనీ ఎస్‌ఐ ఈశ్వర రావు, ఏఎస్‌ఐ తిరుపాల్ నాయక్, హెడ్‌కానిస్టేబుల్స్ మల్లికార్జున, గిరీష్ ప్రసాద్, రమేష్ బాబు, కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

ఉరుకుంద డిప్యూటీ కమిషనర్‌గా వాణి


బాధ్యతలు చేపడుతున్న వాణి

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయ డిప్యూటీ కమిషనర్‌గా వాణి ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న విజయరాజును కసాపురం ఆంజినేయస్వామి దేవాలయానికి బదిలీ కాగా.. అక్కడ పని చేస్తున్న వాణిని ఉరుకుందకు ప్రభుత్వం బదిలీ చేసింది. దీంతో వాణి ఆదివారం విజయరాజు నుంచి బాధ్యతలు తీసుకున్నారు. ఆమె మాట్లాడుతూ ఈరన్న స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామస్తులు, సిబ్బందిని, వివిధ రూపాల్లో స్వామి వారికి విరాళాలు ఇచ్చిన దాతలను, భక్తులను కలుపుకుని పోయి దేవాలయ అభివృద్ధికి పాటుపడుతానన్నారు. ఆలయంలో ఏ అర్చకుడైనా తట్టా పెడితే కఠిన చర్యలు ఉంటాయని ఘాటు గా హెచ్చరించారు.

బయో మందులు విక్రయిస్తే కఠిన చర్యలు

ఎమ్మిగనూరురూరల్: ఎరువుల డీలర్లు అనుమతిలేని బయో మందులను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి మదిరెపల్లి శివశంకర్ హెచ్చరించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మే 26 వ తేదీ ఇచ్చిన 2292 గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం జూలై వరకు మాత్రమే బయో మందులకు అనుమతి ఉందని తెలిపారు. ఈ నెల నుంచి బయో స్లిములెంట్స్ 0-ఫామ్‌లో ఇంక్లూడ్ అయిఉంటే విక్రయించుకోవచ్చని చెప్పారు. అనుమతి లేని జీ2, జీ3 లాంటివి ఉంటే అమ్మకూడదని తెలిపారు.

సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటం


జెండా ఆవిష్కరించిన యూటీఎఫ్ నాయకులు

ఆదోని సెంట్రల్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి యూటిఎఫ్ సంఘం నిరంతరం పోరాటం చేస్తోందని యూటీఎఫ్ జిల్లా సహ అధ్యక్షురాలు జీవిత, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ శ్రీనివాసులు ,మండల అధ్యక్షులు సునిల్ రాజ్ కుమార్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ పెడరేషన్ 52వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని యూటీఎఫ్ కార్యాలయం ఆవరణలో ఆదివారం సీనియర్ నాయకులు కృష్ణమూర్తి, పాపయ్య జెండాను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం నిరంతరం పోరాటం చేస్తూనే ఉంటామన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు సుధాకర్ , మల్లికార్జున ఓంకార్, సినియక్ నాయకులు ఓంకార్ మల్లయ్య, పెద్దయ్య, రుద్రముని, బసప్ప, సలాఉద్దీన్ గిరిబాబు, కృష్ణుడు, నజీర్ అహ్మద్, నారాయణ, రాజా హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడికి గురవుతున్న ఉపాధ్యాయులు
బోధనేతర పనులతో ఉపాధ్యాయులు తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నారని ఎస్టీయూ రాష్ట్ర పురపాలక కన్వీనర్ జి. వీరచంద్ర యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్ నాయుడు తెలిపారు. ఆదివారం ఎస్టీయూ భవనంలో ఎస్టీయూ భీమరాజు అధ్యక్షతన సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ రక రకాల యాప్‌లను రూపొందించి వాటిని అమలు చేయడంతో విద్యా బోధన కుంటు పడే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు రవి, లోక్యనాయక్, ప్రహ్లాద్, సుధాకర్, ప్రసాద్, ఉరుకుందప్ప తదితరులు పాల్గొన్నారు.

గోనెగండ్ల : యూటీఎఫ్ 51 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా ఆదివారం మండల కేంద్రం గోనెగండ్లలోని గంజిహళ్లి రోడ్డు దగ్గర యూటీఎఫ్ పతాకాన్ని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి బాబు, జిల్లా కార్యవర్గ సభ్యుడు నరసింహులు తదితరులు ఆవిష్కరించారు. మండల గౌరవ అధ్యక్ష, అధ్యక్షులు లింగన్న, అక్బార్, నాయకులు జిక్రియా, నాగరాజు, గోవింద రాజులు, వీరేష్ పాల్గొన్నారు.

ఎమ్మిగనూరుటౌన్: యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవంలో భాగంగా ఆదివారం పట్టణంలోని సోమప్ప సర్కిల్ వద్ద యూటీఎఫ్ రాష్ట్ర నాయకురాలు నాగమణి, ప్రాంతీయ కార్యాలయం వద్ద నాయకులు భాస్కర్‌బాబులు సంఘం జెండాలను ఆవిష్కరించారు. గౌరవాధ్యక్షుడు దావీదు, జిల్లా కార్యదర్శులు గుమ్మలబాబు, కొలన్న పాల్గొన్నారు.


పూజలందుకుంటున్న ఈరన్నస్వామి

కౌతాళం: శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా మూడవ సోమవారం ఉరుకుంద ఈరన్నస్వామిని దర్శించుకోవడానికి ఆదివారం ఉదయం నుంచే భక్తులు తరలివచ్చారు. మూడవ సోమవారం అంటేనే ఉరుకుందకు సుమారు 2 నుంచి 3లక్షల మంది భక్తుల తరలివచ్చి స్వామిని దర్శించుకుంటరన్న అంచనా. అంతేకాక మూడవ సోమవారం మంత్రాలయం, ఆదోని, ఎమ్మిగనూరు నియోజకవర్గలతో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఈరోజు ఆప్షన్ హాలిడే కూడా ఇస్తారు. దీంతో సోమవారం రోజు అధికంగా ఉంటారని భావించిన చాల మంది భక్తులు ఆదివారం నుంచి తరలివస్తుండడంతో క్షేత్రం భక్తులతో కిటకిటలాడుతోంది. ఉదయం నుంచే భక్తులు క్యూలైన్‌లో నిలబడి స్వామిని దర్శించుకున్నారు. దేవాలయ అధికారులు భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక దర్శనంతో పాటు, శీఘ్ర దర్శనం, అతిశీఘ్ర దర్శనం, ఉచిత దర్శనం, వివిపీ దర్శనంల ద్వారా భక్తులకు సౌకర్యం కల్పించడంతో దర్శనం సాఫీగా సాగుతున్నది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రాత్రంతా దర్శనాలు ఉంటాయని రాత్రి 12గంటల అనంతరం పూజల కోసం అరగంట పాటు దర్శనాలు ఉండవని ఆలయ డిప్యూటి కమిషనర్ వాణి తెలిపారు.

ఉరుకుంద.. భక్తులతో కిటకిట



అన్వేటి మంఠం నుంచే క్యూలైన్‌లో వస్తున్న భక్తులు,పొర్లదండాలతో స్వామిని మొక్కు కుంటున్న భక్తులు

తుంగభద్రకు భారీగా వరద నీరు


నాగలదిన్నె బ్రిడ్జి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న తుంగభద్ర నది

నందవరం : ఎగువన కురుస్తున్న వర్షాలకు తుంగభద్ర నదికి వరద నీరు భారీగా చేరుతుంది. ఆదివారం మండల పరిధిలోని నాగలదిన్నె బ్రిడ్జి వద్ద తుంగభద్ర నది ప్రవహం ఉధృతమైంది. కోసిగి, కౌతాళం, మంత్రాలయం, నందవరం తదితర ప్రాంతాల్లో గత మూడు రోజులుగా భారీ వర్షాలు కురుస్తునే ఉన్నాయి. దీంతో వాగులు, వంకలు పొంగి పోర్లాయి. ఈ వరద నీరు తుంగభద్ర నదిలో కలవడంతో వరద ఉధృత్తి పెరిగింది. నది తీర ప్రాంత రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పొలాల్లో నీరు చేరడంతో గట్లలను తెంచి నీటిని కిందకు వదులుతున్నారు. అలాగే నది ఒడ్డున ఏర్పాటు చేసుకున విద్యుత్ మోటర్లను ఒడ్డు తెచ్చుకుంటున్నారు.

హర్ ఘర్ తిరంగాపై ర్యాలీ


పట్టణంలో హర్‌ఘర్ తిరంగా ర్యాలీ

ఎమ్మిగనూరుటౌన్: దేశ సైనికులకు సంఘీభావంగా పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ఆదివారం స్థానిక శివసర్కిల్ నుంచి వైఎస్సార్ సర్కిల్ వరకు జాతీయ జెండాలతో పార్టీలకతీతంగా ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని బీజేపీ రాష్ట్ర నాయకుడు, హైకోర్ట్ న్యాయవాది పురుషోత్తం రెడ్డి, జిల్లా అధ్యక్షుడు అక్కమ్మతోట రామకృష్ణ, నాయకులు విజి దయాసాగర్, గురురాజారావ్ దేశాయ్, తొగట నరసింహులు ప్రారంభించారు. అనంతరం విశాల గార్డెన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆదోని ఎమ్మెల్యే పార్థసారథితో పాటు పురుషోత్తం రెడ్డి, రామకృష్ణలను పార్టీ శ్రేణులు గజమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు విట్టా రమేష్, అంకాల్‌రెడ్డి, జగ్గాపురం చిన్న ఈరన్న, లలిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హామీలను తుంగలో తొక్కిన కూటమి


చెట్నెహళ్లిలో కూటమి మోసాలను ప్రజలకు వివరిస్తున్న నాయకులు

మంత్రాలయం రూరల్ : ఆచరణ సాధ్యం కాని హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వాటిని తుంగలో తొక్కి ప్రజలను మోసగించిందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జి.భీమారెడ్డి, జిల్లా కార్యదర్శి విశ్వనాథ్‌రెడ్డి ఆరోపించారు. బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం చెట్నెహళ్లి గ్రామంలో పర్యటించారు. వారు మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీల అమలులో మొదటి ఏడాది ఒక్కటీ కూడా అమలు చేయకుండా ప్రజలను నిలువునా ముంచారని విమర్శించారు. చంద్రబాబు పాలన అంతా దౌర్జన్యాలకే సరిపోయిందన్నారు. రైతులను ఆదుకోవడంలో బాబుకు ఎలాంటి చిత్తశుద్ది లేకపోయిందన్నారు. అమరావతి జపం చేస్తూ రాష్ట్ర ప్రజల సంక్షేమాన్ని గాలికి వదిలేశారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచు అంజి, ఎంపీటీసీ సభ్యుడు రామాంజి, నాయకులు అలింగప్ప, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

దంచికొడుతున్న వానలు


నందవరం గ్రామ సమీపంలో రహదారిపై ప్రవహిస్తున్న వర్షపు నీరు

నందవరం : మండలంలో వర్షాలు దంచికొడుతున్నాయి. గత మూడు రోజులుగా విస్తరంగా వానలు కురిశాయి. ఆదివారం సాయంత్రం ముగతి, నందవరంలో భారీగా వర్షం కురిసింది. రోడ్లు, పంట పొలాల్లో వాన నీరు ఉధృతంగా ప్రవహించింది. రోడ్లపై వర్షపు నీరు ప్రవహించడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రాకపోకలు కొనసాగించాడానికి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అలాగే నదికైరవాడి, గంగవరం, పూలచింత, జొహరాపురం, నాగలదిన్నె, పెద్దకొత్తిలి గ్రామాల్లో ఆదివారం ఉదయం ఓ మోస్తరుగా వరం కురిసింది. ఈ వానలకు రైతులు సాగు పంటలలో ఎరువులు మందులు చల్లుకుంటు బిజీ బిజీగా ఉన్నారు.

ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ కవాతు


ప్రధాన రహదారిలో కవాత్ నిర్వహిస్తున్న ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్

ఆదోని అర్బన్: శాంతిభద్రతల పరిరక్షణ కోసం ఆదివారం స్థానిక సీఐలు శ్రీరామ్, రామలింగమయ్యల ఆధ్వర్యంలో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ కవాతు నిర్వహించారు. పట్టణంలో ప్రధాన రహదారుల్లో, కాలనీ పురవీధుల్లో, సమస్యాత్మక కాలనీల్లో పోలీసులు కవాతు చేశారు. ప్రజలు ధైర్యంగా ఉండాలని, పోలీసులు ఎల్లప్పుడూ అండగా ఉంటారని భరోసా కల్పించారు. ర్యాపిడ్ యాక్షన్ కమాండర్ విజయ్‌కుమార్‌వర్మ, టూటౌన్ ఎస్ఐ రామ్‌నాథ్, సిబ్బంది పాల్గొన్నారు.

రుణాలు రెన్యూవల్ చేసుకోవాలి


రైతుకు రుణాల గురించి వివరిస్తున్న ఎస్‌బీఐ మేనేజర్ నరేష్ బాబు

గోనెగండ్ల : స్థానిక ఎస్‌బీఐ బ్రాంచ్‌లో వ్యవసాయ రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో రెన్యూవల్ చేసుకోవాలి బ్యాంకు చీఫ్ మేనేజర్ నరేష్ బాబు సూచించారు. ఆదివారం మండల కేంద్రంలో రైతుల ఇళ్ల వద్దకు వెళ్లి బ్యాంకు రుణాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో చెల్లిస్తే మళ్లీ రుణాలు తీసుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. మొండి ఖాతాదారులు తమ మొండి బాకీలను వన్ టైం సెటిల్‌మెంట్‌తో ఈనెల చివరిలోపు లోన్ క్లోజ్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ మధు మనోహర్, సిబ్బంది అక్బర్, సద్దాం, ఉమార్, శంకర్ పాల్గొన్నారు.

మడుగులు కాదు.. రోడ్లే

- చిన్నపాటి వర్షాలకే కుంటలను తలిపిస్తున్న రోడ్లు
- రోడ్లపై గుంతల్లో నిల్వ ఉన్న వర్షపు నీరు
- అవస్థలు పడుతున్న ప్రయాణికులు


గోనెగండ్లలో కర్నూలు, ఎమ్మిగనూరు ప్రధాన రహదారిపై నిలిచిన వర్షపు నీరు

గోనెగండ్ల : గత మూడు రోజులుగా మండలంలో కురుస్తున్న వర్షానికి మండలంలో పలు రహదారులు గుంతల మయమయ్యాయి. వర్షపు నీరు నిల్వ ఉండడంతో రోడ్లు మడుగులను తలపిస్తున్నాయి. మండలంలో గోనెగండ్ల నుంచి పిల్లిగుండ్ల వెళ్లే రోడ్డు గుంతలు పడి అధ్వానంగా తయారైంది. ఈ రహదారిలో పిల్లిగుండ్ల, ఒంటెడుదిన్నె, ఎర్రబాడు, వీరంపల్లి, నెరుడుప్పలతో పాటు దేవనకొండ మండలంలోని పలు గ్రామాలకు చెందిన ప్రజల రాకపోకలు సాగిస్తుంటారు. అలాగే హెచ్. కైరవాడి గ్రామం నుంచి కులుమాల, చిన్న నేలటూర్, పెద్దనేలటూర్ గ్రామాలకు వెళ్లే రోడ్డు పరిస్థితి కూడా అంతే. చిన్నపాటి వర్షం కురిసిన హెచ్. కైరవాడిలో రోడ్డు కుంటను తలపిస్తుంది. గోనెగండ్లలోని వైఎస్సార్ సర్కిల్‌లోని ప్రధాన రహదారిలో కూడా వర్షం వస్తే కుంటను తలపిస్తుంది. ఈ దారిలో నిత్యం వాహనాల రద్దీ ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే, ఎంపీ తదితర ప్రజా ప్రతినిధులు ఈ దారిలో వెళ్లినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల రోడ్డు అధ్వానంగా మారడంతో బస్సు, ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనాలపై ప్రయాణాలు సాగించేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆ రోడ్లను బాగు చేయాలని పలుమార్లు ప్రజా ప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్లు బాగు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


హెచ్. కైరవాడిలో పెద్దనేలటూర్ రోడ్డులో నిలిచిన వర్షపు నీరు


పిల్లిగుండ్ల రహదారిపై నిలిచిన నీరు